ప్రజాశక్తి

ఆదివారం 2 మార్చి 2025 | 5 | విజయనగరం



3న బొబ్బిలిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలోని రాజా కళాశాలలో ఈ నెల మూడో తేదిన దివిస్ లాబ్స్ ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వీరేంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎనాలిసిస్ లేదా ప్రొడక్షన్ యూనిట్‌లో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. బిఎస్‌సి కెమిస్ట్రీ, ఎంఎస్‌సి ఆర్గానిక్, ఎనాలిటికల్ కెమిస్ట్రీ, బిటెక్ కెమికల్ ఇంజనీరింగ్, బి.ఫార్మసీ మేల్ విద్యార్థులు అర్హులని తెలిపారు. 2020 -2025 కాలంలో పై కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం కళాశాల ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎన్.శరత్ కుమార్ (81860 92999)ను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతం

892 మంది విద్యార్థులు గైర్హాజరు • పరిశీలించిన కలెక్టర్ అంబేద్కర్

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ మొదటిసంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 66 కేంద్రాల్లో ఇంటర్ మొదటి ఏడాది తెలుగు పరీక్ష జరిగింది. పరీక్ష ఉదయం 9 గంటల కు ప్రారంభం కావడంతో విద్యార్థులంతా పరీక్ష కేంద్రాలకు 8 గంటలకే చేరుకున్నారు. బస్సులు, ఆటోలు, దగ్గరలో ఉన్న వారు బైక్‌లపై తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఇవ్వకపోవడంతో విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రం లోపలికి పంపించారు. హాల్ టికెట్స్, పెన్ తప్ప ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించలేదు. మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్ష ఎటువంటి ఆటంకాలు, సమస్యలు లేకుండా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం జనరల్ విద్యార్థులు 18,686 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 18,178 మంది హాజరై, 508 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2980 మందికి 2596 మంది హాజరుకాగా, 384 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 21,666 మందికి 20,774 మంది హాజరు కాగా, 892 మంది గైర్హాజరయ్యారని అర్ ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు. శనివారం తొలి పరీక్ష ప్రశాంతంగా జరిగిందనీ ఆయన తెలిపారు. సోమవారం ద్వితీయ ఇంటర్ పరీక్ష జరగనుందని తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : కలెక్టర్

ఇంటర్ మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తనిఖీ చేశారు. విజయనగరంలోని చైతన్య, గాయత్రి కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి వసతులను, వైద్య, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల ఛీఫ్ సూపరింటిండెంట్లతో మాట్లాడి విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీశారు. కొన్నిచోట్ల తరగతి గదుల్లో వెలుగు తక్కువగా ఉండటంతో, వెంటనే లైటింగ్ ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సీటింగ్ విధానాన్ని మార్చాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట తాహసీల్దార్ కూర్మనాథరావు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు కె.అప్పారావు పాల్గొన్నారు.

వేపాడ : వేపాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 267 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ కిలపర్తి అప్పారావు తెలిపారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందుగానే చేరుకున్నారు.

గుర్ల : గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

హాల్‌టిక్కెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 201 మందికి 197 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతి లేదని ప్రభుత్వం నిబంధన విధించడంతో విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు.

వంగర : మండలంలో మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలకు 261 మందికి 255 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కోట రవిశంకర్ తెలిపారు. ఎస్ఐ షేక్ శంకర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

కొత్తవలస :. కొత్తవలస మండలంలో నాలుగు కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. 896 మందికి గాను 36 మంది గైర్హాజరయ్యారు. వాగ్దేవి కళాశాలలో 223 మందికి 215 మంది, భారత్ జూనియర్ కళాశాలలో 213 మందికి గాను 204 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 231 మందికి గాను 221 మంది, ప్రగతి జూనియర్ కళాశాలలో 229 మందికి గాను 220 మంది హాజరయ్యారు.

నెల్లిమర్ల : స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిఆర్ అంబేద్కర్ గురుకులం కేంద్రంగా జరిగిన జూనియర్ ఇంటర్ పరీక్షలకు 877 మంది హాజరయ్యారు. 21 మంది గైర్హాజరయ్యారు. సికెఎం కళాశాలలో 518 మందికి 504 మంది, గురుకులంలో 380 మందికి 373 మంది హాజరయ్యారు.

డెంకాడ : డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలను భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ పరిశీలించారు. తొలిరోజు పరీక్షకు 255 మందికి గాను 246 మంది విద్యార్థులు హాజరయ్యారు. సిఐ వెంట ఎస్ఐ ఎస్ఎంఎస్ నాయుడు, సిబ్బంది ఉన్నారు.

వేపాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద క్యూలో ఉన్న విద్యార్థినులు

ఆప్కాస్ రద్దుకు ప్రభుత్వ యత్నం

• ఆందోళనలో మున్సిపల్ కార్మికులు • రద్దు చేయాలని డిమాండ్

ప్రభుత్వం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల పట్ల సవతి ప్రేమ ప్రదర్శిస్తోంది. ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలోని టిడిపి, జనసేన పార్టీలు కార్మికులకు హామీలు కురిపించాయి. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తామని, పర్మినెంట్ చేస్తామని ఇలా అనేక హామీలు ఇచ్చాయి.కానీ వాటిని అమలు చేయకపోగా ఏకంగా ఆప్కాస్‌ను రద్దు చేసేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం పూనుకుంది.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రప్రభుత్వం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల పేరుతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ అతితక్కువ జీతాలు ఇస్తోంది. తమను పర్మినెంట్ చేయాలని ఎన్నో ఏళ్లుగా వారంతా ఆందోళన నిర్వహిస్తున్నారు. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి, కుటుంబ అవసరాల కోసం కష్టపడి పనిచేస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో ఆప్కాస్ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేసింది.తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం కార్పొరేషన్‌ను తొలగించిపాత పద్దతిలోనే ఏజెన్సీలో ద్వారా వేతనాలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. జిల్లాలో సుమారు 1000 మంది కార్పొరేషన్ నుంచి జీతాలు తీసు కుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఖాళీ అయిన ఉద్యోగాలు భర్తీ చేయడం లేదు. ఈ పనిని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల పేరుతో భర్తీ చేయిస్తున్నారు. డిగ్రీలు, పిజిలు చదివి ఏ ఉద్యోగాలు రాక అతి తక్కువ జీతాలకు ఎందరో యువకులు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్మికులు తెల్లవారు జాము నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పనులు చేస్తున్నారు.

గతంలో ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అయినా ప్రవేటు ఏజెన్సీల ద్వారా నిర్వహిం చేవారు. జీతాలు వారికి ఇస్తే, వారు కార్మికులకు చెల్లించే పరిస్థితులుండేవి. ఇందుకోసం జీతంలో ఒక్క శాతం ఏజెన్సీ తీసుకునేది. కార్మికులు ఇఎస్ఐ, పిఎఫ్, జిఎస్‌టిలు ఏజెన్సీలు చెల్లించాలి. గతంలో ఏజెన్సీలు చెల్లించకుండా దోపిడీ చేశాయి. వైఎస్ జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, అప్కాస్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేశారు. ఏజెన్సీలను తొలగించి అందరినీ దీని కింద చేర్చారు. వీరికి నాలుగు శ్లాబ్‌ల కింద జీతాలు చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఈ విధానానికి స్వస్తి చెప్పి పాత పద్ధతిలోనే ఏజెన్సీలకు కాంట్రాక్ట్ ఇచ్చేలా టిడిపి కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. దీన్ని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్నో ఏళ్లగాపనిచేస్తున్న తమను పర్మినెంట్‌చేయాలని కార్మికులు కోరుతుంటూ దీన్ని పక్కనపెట్టి అసలుకే మోసం చేసేలా ప్రభుత్వం ఆలోచన చేయడం పట్ల వారంతా మండి పడుతున్నారు. ఈనేపథ్యంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఆప్కాస్ రద్దు యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కార్మికులు డిమాండ్‌చేస్తున్నారు. దీనిపై జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలకూ ఇప్పటికే వినతులు ఇచ్చారు. కార్మికులు ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు పంపే ఉద్యమం చేపట్టారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ ను రద్దు చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించాలి. ఆప్కాస్ ఏర్పడి ఇపుడిపుడే వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు గాడిలో పడుతున్నాయి. ఏజెన్సీలకు ఇవ్వడం ద్వారా కార్మికులకు సకాలంలో వేతనాలు అందవు. ఏజెన్సీల దయా దాక్షిణ్యాలపై వీరంతా ఆధారపడాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

- ఎ.జగన్మోహన్‌రావు, ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు

ఉత్తరాంధ్ర ప్రజలకు మోసం

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో పెట్టిన బడ్జెట్ కేవలం అంకెలు బడ్జెట్, ఉత్తరాంధ్రకు, జిల్లాకు అభివృద్ధి నిరోధక బడ్జెట్ అని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలను ఈ బడ్జెట్‌లో మోసం చేశారని విమర్శించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఓటు అన్ అకౌంట్ పెట్టి దానిని కంటిన్యూ చేస్తూ ,ఎక్కడా ఎన్నికల హామీని అమలు పరచకుండా మొన్నటి వరకు నడిచిందన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టినప్పటికీ జిల్లా, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.1,10,000 కోట్లు అప్పులు తెచ్చారని, చేసిన అప్పులు సంక్షేమ పథకాల కు ఖర్చు చేయలేదని, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, 50ఏళ్లకే పెన్షన్, రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఊసు బడ్జెట్‌లో లేదన్నారు. జిల్లా సాగునీటి రంగం మీద ఆధారపడి ఉందని, తోటపల్లికి రూ.145కోట్లు అవసరం ఉంటే రూ.35 కోట్లు కేటాయించడం అన్యాయమని అన్నారు. తారకరామ తీర్థ సాగర్ పూర్తి చేయడానికి నిధులు కేటాయించడం లేదన్నారు. భోగాపురం విమానాశ్రయం, విజయనగరం పట్టణానికి తాగునీరు అవసరాలు తీరుతాయని, కానీ అటువంటి ప్రాజెక్టుకు అరకొర కేటాయింపులు చేశారని విమర్శించారు. వెంగళరాయ సాగర్ కెనాల్ సిస్టమ్ పాడైపోయినా ఒక్క పైసా కూడా కేటాయించ లేదన్నారు. గిరిజన యూనివర్సిటీ కి సరిపడా నిధులు కేటాయింపులు లేవన్నారు. పెట్టుబడులు,ఉద్యోగాలు కల్పన విషయంలో కూటమి ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలను మోసం చేసిందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సూర్యనారాయణ రాజు, నెక్కల నాయుడు బాబు, గంట్యాడ జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి పాల్గొన్నారు.

గిరిజనుల చిత్రకళ చాలా గొప్పది

కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, మాన్సాస్ విద్యాసంస్థలు సంయుక్తంగా ' ఆదిచిత్తర : నేషనల్ ట్రైబల్ పెయింటర్స్ కాన్‌కేవ్ పేరుతో రెండు రోజులుపాటు జాతీయ గిరిజన చిత్రకారుల సమ్మేళనం కోటలోని రౌడ్‌మహల్‌లో శనివారం ప్రారంభమైంది. కేంద్ర మాజీమంత్రి, మాన్సాస్ చైర్మన్ పి.అశోక్‌గజపతిరాజు, కర్ణాటక కువెంపు విశ్వ విద్యాలయ విసి శరత్‌అనంతమూర్తి, సిటియు విసి తేజస్వి కట్టమణి, మధ్య ప్రదేశ్‌కు చెందిన ప్రముఖ గోండ్ చిత్రకారిణి, పద్మశ్రీ పురస్కార గ్రహీత దుర్గాభాయి వ్యయం జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ భారతదేశపు సుసంపన్నమైన గిరిజన వారసత్వాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. వివిధ చిత్ర కారులతో మాట్లాడి వారి వర్ణ చిత్రాలు గీసే పద్ధతులను పరికరాలను, వివిధ పదార్థాలను గూర్చి ఆరా తీశారు. కర్నాటకలోని శివమొగ్గలో గల కువెంపు విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ శరత్ అనంతమూర్తి మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన వ్యవస్థలో అంతర్భాగమైన గిరిజన కళ ప్రాముఖ్యతను గౌరవించాలని తెలిపారు. ప్రఖ్యాత గోండ్ కళాకారిణి పద్మశ్రీ దుర్గా బాయి వ్యామ్ గిరిజన కళాత్మకతపై తన అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కె.వి.ఎల్. రాజు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డాక్టర్ బిఎస్ఎన్ రాజు, సిటియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, డాక్టర్ జితేంద్రమోహన్ మిశ్రా, వివిధ పాఠశాలల డీన్‌లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. విద్యార్థుల గిరిజన సాంప్రదాయిక సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

గిరిజన చిత్రకళలను పరిశీలిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్

నైతిక విలువలతో నడిచే సంస్థ ఇన్ఫోసిస్

ఎమ్‌డి సురేష్

ప్రజాశక్తి-డెంకాడ

ఇన్ఫోసిస్ నైతిక విలువతో నడిచే సంస్థని విశాఖపట్నంలోని ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ ఎమ్‌డి ఎం.సురేష్, మేనేజర్ కిశోర్ కుమార్ తెలిపారు. మండలంలోని చింతలవలస కళాశాలలో ఎంవిజిఆర్ కళాశాల 27వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైతిక జీవన విలువలను వదిలిపెట్టకుండా మక్కువతో పనిచేయాలని, ఎంవిజిఆర్ వారసత్వాన్ని విజయవంతంగా కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంవిజిఆర్ డైరెక్టర్ ఎస్.సీతారామరాజు, ప్రిన్సిపల్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపల్ వైఎంసి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి కొండపై మళ్లీ మొదలైన పనులు

అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని వివాదాస్పదంగా మారిన రూ.కోట్ల విలువైన చెరుకుపల్లి కొండపై పనులు ప్రారంభించేందుకు వచ్చిన ట్రాక్టర్‌ను గ్రామస్తులు కొంతమంది శనివారం సాయంత్రం అడ్డుకున్నారు. దీంతో పనులు చేయకుండానే ట్రాక్టర్ వెనుదిరిగింది. ఈ కొండను అప్పట్లో కొంతమంది మాజీ సైనికులకు కేటాయించి వారిపేరిట ఆన్‌లైన్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం జిల్లా కలెక్టర్‌గా వచ్చిన సూర్యకుమారి మాజీ సైనికుల పేర్లను తప్పించి యథావిధిగా కొండను ఉంచారు. అప్పట్నుంచి ఈ కొండపైకి ఎవరూ రాలేదు. కానీ శనివారం సాయంత్రం ట్రాక్టర్ రావడంతో గ్రామస్తులు అడ్డుపడ్డారు. దీనిపై రెవెన్యూ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు సరగడ తోగులు రెడ్డి, బైరెడ్డి శ్రీను, గంట నర్సింగ్ రావు, రిక్క ఈశ్వరరావు తెలిపారు. దీనిపై తహాశీల్దార్ సురేష్‌ను వివరణ కోరగా ఈ కొండపై ఎవరికీ ఎటువంటి అనుమతులూ ఇవ్వలేదన్నారు. ఎవరైనా అక్రమంగా కొండపై పనులు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పనులు చేయకుండా ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్తులు

చీపురుపల్లిలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి-చీపురుపల్లి:

ఈ నెల 2, 3, 4 తేదీల్లో జరిగే కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు విధించినట్లు ఎస్ఐ ఎల్.దామోదరరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జాతరకు ఇద్దరు డిఎస్‌పిలు, 8 మంది సిఐలు, 30 మంది ఎస్ఐలు, 500 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతర సందర్భంగా ట్రాఫిక్‌ని మళ్లించినట్లు ఎస్ఐ వివరించారు. చీపురుపల్లి నుండి లావేరు వైపు వెళ్లే వాహనాలను రావివలస జంక్షన్ నుండి తోటపల్లి కాలువ, నాగంపేట మీదుగా మళ్లించినట్లు తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నాలుగు చక్రాల వాహనాలకు, పాత కోర్టు ఆవరణ, తంగుడు రామకృష్ణ స్థలం, సబ్‌జైల్ పక్కన ద్విచక్రవాహనాలకు పార్కింగ్‌కు కేటాయించినట్లు చెప్పారు. లావేరు నుంచి చీపురుపల్లి వైపు వెళ్లే వాహనాలను పుర్రేయ వలస, చుక్కవలస, కాపుశంభం మీదుగా మళ్లించినట్లు తెలిపారు. లావేరు వైపు నుండి వచ్చే వాహనాలకు పుర్రేయవలస దగ్గర పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజుల భారీ వాహనాలకు చీపురుపల్లి వైపు రాకపోకలకు అనుమతి లేదని స్పష్టంచేశారు.

జిల్లా స్థాయి సైన్స్ దినోత్సవం

క్విజ్, సెమినార్ నిర్వహణ • విజేతలకు బహుమతులు అందజేసిన డిఇఒ, ఎపిసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి జాతీయ సైన్స్ దినోత్సవం శనివారం కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూలులో ఘనంగా జరిగింది. డిఇఒ యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ ఎ.రామారావు, విజయనగరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కె.వి. రమణ, బొబ్బిలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి కె. మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్' అనే అంశంపై క్విజ్, సెమినార్ పోటీలు నిర్వహించారు. మండలస్థాయి పోటీల్లో అత్యుత్తమంగా నిలిచిన ముగ్గురు, సెమినార్‌లో తొలి మూడుస్థానాలు సాధించిన విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. క్విజ్‌లో జిల్లా స్థాయి సినియర్ విభాగంలో బేకి అన్నపూర్ణేశ్వరి (ప్రభుత్వ బాలిక, ఉన్నత పాఠశాల, విజయనగరం), హేమలత (జామి కెజిబివి), బండారు కీర్తన (గుర్ల జెడ్‌పి హైస్కూలు), సంగిరెడ్డి హైమా (జెడ్‌పి హైస్కూలు గరుడబిల్లి), మట్టల మోక్ష (అరసాడ హైస్కూలు) మొదటిస్థానంలో

బహుమతులు అందజేస్తున్న డిఇఒ మాణిక్యంనాయుడు, ఎపిసి రామారావు

నిలిచారు.

జిల్లా స్థాయిలో సీనియర్ విభాగంలో క్విజ్‌లో ద్వితీయ స్థానం పొందిన వారిలో సిహెచ్ సూర్య ప్రకాష్ (గరివిడి జెడ్‌పి హైస్కూలు), ఆర్.శివ (ఎపిఎంఎస్,మేడపల్లి), జి.నేత్రాదేవి (గుర్లజెడ్‌పి హైస్కూలు), ఎల్. నిత్య సారధి (జెడ్‌పి హైస్కూలు, గరివిడి), ఐ.వైష్ణవి (కొట్యాడ జెడ్‌పి హైస్కూలు) ఉన్నారు. జిల్లా స్థాయిలో జూనియర్ విభాగంలో క్విజ్ లో ప్రథమ స్థానం పొందిన వారిలో కె.జనని (ఎపిఎంఎస్, గర్భాం), ఎల్.ఇందుమతి నాయుడు (జెడ్‌పి హైస్కూలు, అరసాడ) ఉన్నారు.

జూనియర్ విభాగం క్విజ్ లో ద్వితీయ స్థానం పొందిన విద్యార్థుల్లో జి.మోహిత్ కుమార్ (ఎపి మోడల్ స్కూలు,పెదమేడపల్లి), వై జ్ఞాన వైష్ణవి (ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల, గజపతినగరం), జిల్లా స్థాయిలో సెమినార్‌లో ప్రథమ స్థానం కె. కీర్తన (కొత్తవలస) ద్వితీయ స్థానం ఎం. కీర్తి, (తెర్లాం), తృతీయ స్థానం ఎస్.వైష్ణవి (గంట్యాడ) ఉన్నారు. ప్రోత్సాహక బహుమతులను వి.అవినాష్ (బొబ్బిలి), యు.చరిష్మా (వేపాడ) గెలుపొందారు. వీరికి డిఇఒ, సమగ్ర శిక్ష ఎపిసి బహుమతులు అందజేశారు.

ప్రాజెక్టుల కన్నా.. ఎయిర్‌పోర్టే మిన్నా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను..! రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ఉమ్మడి విజయనగరం జిల్లా అభివృద్ధి, ప్రజల అవసరాలు, సంక్షేమం, చదువు సంధ్యలు, వైద్యారోగ్యం వంటివాటి కన్నా అత్యంత ధనవంతులకు అవసరమైన భోగాపురం ఎయిర్‌పోర్టునే ప్రభుత్వం మిన్నగా భావిస్తోంది. ఈ విషయం తాజా రాష్ట్ర బడ్జెట్‌లో చాలా స్పష్టంగానే అర్థమైంది. పైకి మాత్రం పేదలు, మధ్య తరగతి ప్రజల కోసం తమ ప్రభుత్వం పనిచేస్తున్నట్టుగాను, విజయనగరం జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టుగాను పాలకులు ప్రతి సందర్భంలోనూ చెబుతున్నారు. కానీ, ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులతో మాటలకు చేతలకు పొంతన లేదని, పేదల కన్నా కార్పొరేట్ అవసరాలే ప్రభుత్వానికి ఎక్కువగా మారాయని తేటతెల్లమైంది. బడ్జెట్‌లో ఉమ్మడి విజయనగరానికి కేటాయింపులను ఒక్కసారి పరిశీలిస్తే భోగాపురం ఎయిర్‌పోర్టుకు అనుసంధానంగా రహదారి నిర్మాణం కోసం రూ.195కోట్లు కేటాయించగా, జిల్లాలోని వివిధ అవసరాలకు కేటాయించిన మొత్తం రూ.150కోట్లకు మించలేదు. జిల్లాకు ఎంతగానో అవసరమైన సాగునీటి ప్రాజెక్టులకు కంటితుడుపు కేటాయింపులే ఉన్నాయి. మూడు జిల్లాలకు సాగునీరందించే తోటపల్లి ప్రాజెక్టుకు రూ.519.1119కోట్ల కోసం అధికార యంత్రాంగం ప్రతిపాదనలు పంపగా కేటాయింపు కేవలం రూ.47.81కోట్లే. రామతీర్థసాగర్‌కు రూ.807.55 కోట్లు కోరగా రూ.68కోట్లు కేటాయించారు. ఈ నిధులు కేవలం భూమి కొనుగోలు లేదా ఆర్అండ్ఆర్‌కు కూడా సరిపోని పరిస్థితి ఉంది. ఇక మన్యం జిల్లా ఏజెన్సీలో నిత్యం ఏనుగులు

సంచరిస్తున్నాయి. రైతులు, అటవీ సిబ్బంది దాడికి గురైతున్నారు. కొంతమంది గాయపడగా, మరికొందరు చనిపోయారు. నిత్యం పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికీ గిరిజన ప్రాంతవాసులు, రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్ని రక్షించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఎలిఫెంట్ ప్రాజెక్టు పేరిట కేవలం రూ.కోటి 28లక్షలు కేటాయింపుతో చేతులు దులుపుకుంది. విజయనగరం జెఎన్‌టియు ఇంజినీరింగ్ వర్శిటీ అభివృద్ధికి రూ.5.60కోట్లు మాత్రమే కేటాయించారు. వర్శిటీ స్థాయి చదువులు, వసతులకు ఈ నిధుల ఏమూలకూ సరిపోని పరిస్థితి. కురుపాం ఇంజినీరింగ్ కాలేజీకి ఇంకా పూర్తిస్థాయిలో వసతులు, మౌలిక సదుపాయాలు, కాలేజీ స్థాయికి తగ్గ విద్యాప్రమాణాలు సమకూరలేదు. ఇటువంటి విద్యాసంస్థకు కూడా రూ.3.40కోట్లతో సరిపెట్టారు. కోరుకొండ సైనిక్ స్కూల్‌కి కూడా రూ.కోటి మాత్రమే కేటాయింపు. మరీ ఘోరంగా 24వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన జంఝావతి ప్రాజెక్టుకు పట్టుమని రూ.10వేలకు మించి కేటాయించలేదంటే రైతులపట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈనేపథ్యంలో కేవలం కొంతమందికి మాత్రమే ఉపయోగపడే ఎయిర్‌పోర్టుపై ఉన్న శ్రద్ధ, జిల్లా అభివృద్ధి, అందులోనూ రైతులపైనా, పేద, మధ్య తరగతి ప్రజలపైనా లేదంటూ జిల్లాలో పబ్లిక్ వినిపిస్తోంది.

రైతులకు నష్టం కలిగించే బడ్జెట్

ప్రజాశక్తి- మెంటాడ

టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతుల నడ్డివిరిచేలా ఉందని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో గుర్లెద్దు మినీ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేస్తానని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇచ్చిన హామీ నీటి మూటలుగానే మిగిలిందని చెప్పారు. ప్రాజెక్టుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసి, పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటనలు తప్ప ఆచరణలో చిత్తశుద్ధి లోపించిందని తెలిపారు. ఈ విషయం బడ్జెట్ కేటాయింపులు చూస్తే అర్థమవుతుందని చెప్పారు. రైతులకు సాగునీరు అందించేందుకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఒప్పందాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కార్మిక శాఖ అధికారుల వద్ద చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు.. జ్యూట్ మిల్లు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శనివారం జరజాపుపేటలో జ్యూట్ మిల్లు తిరిగే క్రమంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 10న విశాఖపట్నంలో కార్మిక శాఖ అధికారుల వద్ద చేసుకున్న ఒప్పందాలను జ్యూట్ యాజమాన్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కె.పద్మనాభం, ఎస్.రమణ, ఎ.రావు, ఎం.కృష్ణ, టి.తాత తదితరులు పాల్గొన్నారు.

పల్లవికి 'సత్య' యాజమాన్యం అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి ఎస్. పల్లవికి అంతర్ యూనివర్సిటీ గేమ్స్, స్పోర్ట్స్ 2024-25 వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించింది. పల్లవి ఇటీవల హిమాచల్ ప్రదేశ్ ధర్మశాల సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన అంతర్ యూనివర్సిటీ గేమ్స్, స్పోర్ట్స్ 2024-25 వెయిట్ లిఫ్టింగ్ లో 71 కేజీల విభాగంలో క్లీన్ అండ్ జర్క్ 110 కేజీలు, స్నాచ్ 90 కేజీలు మొత్తం 200 కేజీలు వెయిట్ ఎత్తి జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించింది. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో డైరెక్టర్ డాక్టర్ ఎం. శశి భూషణ రావు మాట్లాడుతూ పల్లవిని చూసి విద్యార్థులు స్ఫూర్తిని పొందాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, కోచ్ చల్ల రాము, ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం. ఉదయ్ కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి సూరపు నాయుడు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్ హెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలి

ప్రజాశక్తి-వేపాడ

పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలని నిర్వాసితుల పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం వేపాడ, లక్కవరపుకోట మండలాల్లో పోరాట కమిటీ నాయకులు పర్యటించి, రైతులతో మాట్లాడారు. రైతుల డిమాండ్ మేరకు జిల్లా కలెక్టర్ గ్రామసభలు నిర్వహిస్తే అన్ని గ్రామాల్లో డిజైన్ మార్చాలని ఏకగ్రీవ తీర్మానం చేశారని ఆయన తెలిపారు. ఆ గ్రామసభ తీర్మానాన్ని అధికారులు ఎందుకు పరిగణనలో తీసుకోవడం లేదో తెలియజేయాలన్నారు. పర్యటనలో పోరాట కమిటీ నాయకులు జక్కాన సింహాద్రి అప్పడు, లక్కవరపుకోట మాజీ ఎంపిపి జక్కాన కన్నబాబు, నక్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సూర్య చంద్రస్వామికి సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కోనేరు లక్ష్మయ్య విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందిన డాక్టర్ గారి సూర్య చంద్రస్వామిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్య చంద్రస్వామి మాట్లాడుతూ ఈ పరిశోధన ఇంజినీరింగ్, తయారీ పరిశ్రమల అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. సీతం కళాశాల డైరెక్టర్ ఎం. శశిభూషణ్ రావు మాట్లాడుతూ, మెటల్ మ్యాట్రిక్స్ కాంపోజిట్స్ రంగంలో ఇలాంటి పరిశోధనలు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉంటాయని ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.వి. రామమూర్తి, డిపార్ట్మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సిహెచ్.వెంకట లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మిన్) టిడివి నాయుడు పాల్గొన్నారు.

రాళ్లచెరువులో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని ముంజేరు రెవెన్యూ గ్రామ పరిధిలోని రాళ్ల చెరువు ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. రాళ్లచెరువులో సుమారు ఎకరా వరకు ఆక్రమించుకొని ఫెన్సింగ్ వేశారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో తహశీల్దార్ ఎం.సురేష్ స్పందించారు. విఆర్‌ఒ శ్రీనివాసరావు అక్కడికి చేరుకొని ఆక్రమణదారులు వేసిన ఫెన్సింగ్ పోల్స్‌ను తొలగించారు. ఇకపై అక్రమాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నివేదికను తహశీల్దార్‌కు అందజేస్తామన్నారు.

ఒలింపియాడ్‌లో గురజాడ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2024- 25 నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ నిర్వహించిన సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో గురజాడ పాఠశాల 4వ తరగతికి చెందిన ఎన్.పూజ్యశ్రీత, ఐదవ తరగతి చెందిన అర్. నీరదీ సాయి గోల్డ్ మెడల్ సాధించారు. ఇంగ్లీష్ ఒలింపియాడ్ పరీక్షలో నాలుగో తరగతికి చెందిన ఎన్. సృజన్, ఆరో తరగతికి చెందిన జె.లివియాగ్రేస్, ఏడో తరగతికి చెందిన ఎం. దీవెన. ఎనిమిదో తరగతి చెందిన జి.లాస్య, బి.భూమి, ఎస్.లాస్య బంగారు పథకాలు సాధించారు వీరిని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, కర్స్పాండెంట్ ఎం.స్వరూప, హెచ్‌ఎం పూడి శేఖర్ అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-డెంకాడ

డెంకాడలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ వైకుంఠరావు ఆ గ్రామంలో శనివారం పర్యటించారు. చంపావతి నదిలో ఉన్న బావిని పరిశీలించారు. ఆ నీటిని గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకుకు పంపించి, గ్రామస్తులకు నీటి కొరత లేకుండా చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దుకాణాల వద్ద సిసి కెమెరాలు తప్పనిసరి

ప్రజాశక్తి-రామభద్రపురం

దుకాణ సముదాయాల వద్ద వ్యాపారులు తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ ప్రసాదరావు ఆదేశించారు. శనివారం ఆరికతోట జాతీయ రహదారి పక్కన ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులు నగుడు జగన్మోహనరావు, జాగాన యమున,బర్ల తిరుపతి రావు,విజయ పాల్గొన్నారు.

ఘనంగా సోంపురం పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని హెచ్‌ఎం బిపిఎ రాజు ఆధ్వర్యాన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. పాఠశాల వార్షిక నివేదికను, ప్రగతిని వీడియో ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రీఫైనల్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన ఎరినమ్మ, శిరీషాకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

గురుకులంలో ప్రవేశాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-బొబ్బిలి

గురుకుల పాఠశాలలో అడ్మిషన్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎపిఆర్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశాలకు, 6, 7, 8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయిందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 30వ తేదిలోగా https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. వివరాలకు 87126 25023 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు.. సైన్స్‌డే సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో సత్తాచాటారు. పాఠశాల నుంచి పోటీల్లో పాల్గొన్న చైతన్య, కావ్య జిల్లా స్థాయిలో మూడో స్థానం సాధించారు. వారికి ప్రశంసాపత్రాలను, బహుమతులను అందజేశారు.

రైస్‌కార్డుదారులు ఇకెవైసి చేసుకోవాలి

ప్రజాశక్తి-డెంకాడ

రైస్‌కార్డులో ఉన్న సభ్యులంతా ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ వి.పద్మావతి కోరారు. మండలంలో ఇంకా 4922 మంది ఇకెవైసి చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. రేషన్ షాప్ డీలర్ వద్దకు వెళ్లి ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు.

మహిళా సాధికారతకు కృషి చేద్దాం

మహిళా దినోత్సవం సందర్భంగా 7 వరకు వారోత్సవాలు : ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 1 నుండి 7 వరకు జిల్లాలో మహిళా సాధికారిత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. ఈనేపథ్యంలో విద్యార్థినులకు మహిళల భద్రత పట్ల, పోలీసు విధుల పట్ల అవగాహన కల్పించేందుకు పరేడ్ గ్రౌండులో 'ఓపెన్ హౌస్'ను శనివారం ఎస్‌పి ప్రారంభించారు. ఈ వారం రోజులుపాటు నిర్వహించే కార్యక్రమాల్లో మహిళల భద్రత, రక్షణ, సమానత్వం, అభివృద్ధి, సాధికతకు కృషి చెయ్యాలన్న సంకల్పంతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఓపెన్ హౌస్ నిర్వహించామన్నారు. 2న మహిళల స్వీయరక్షణ, ఆనందంగా జీవించేందుకు అవలంభించాల్సిన విధానాలను, మార్చి 3న వ్యాస రచన పోటీలు, 4న వక్తృత్వ పోటీలు, 5న చిత్ర లేఖనం పోటీలు, 6న జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లు, ఎస్‌పి కార్యాలయాన్ని విద్యార్థినుల సందర్శన, 7న ప్యానల్ డిస్కషన్, మహిళల గౌరవాన్ని పెంపొందించే సినిమా ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8న మహిళా దినోత్సవం రోజున జిల్లా కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమశాఖ, ఇతర శాఖల సహకారంతో పెద్ద ర్యాలీ నిర్వహించి, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. పరేడ్ గ్రౌండులో నిర్వహించిన 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, మహిళా పిఎస్ సిఐ ఈ.నర్సింహమూర్తి, 1వ పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

రామభద్రపురం : ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పోలీసుస్టేషన్లో సిఐ నారాయణరావు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ నారాయణరావు మాట్లాడుతూ మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, నిర్భయ చట్టం, పోక్సో, ఈవ్ టీజింగ్ కేసుల్లో విధించే సెక్షన్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

తెర్లాం : తెర్లాం పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని సిఐ నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల బాలికలకు ఓపెన్ హౌస్ విధి విధానాలను సిఐ వివరించారు. మహిళా చట్టాలు, వాటి ఉపయోగాలను తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సాగర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం హై స్కూల్ ఆవరణలో ఉన్న అంగన్వాడి కేంద్రం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి, గీత లక్ష్మి పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నెల్లిమర్ల జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల విద్యార్థులు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ సందర్శించారు. విధి నిర్వహణ, రికార్డుల గురించి ఎస్ఐ బి.గణేష్ వారికి వివరించారు.

బొండపల్లి : చట్టాలపై అవగాహన పెంచుకొని తెలిసిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ యు.మహేష్ విద్యార్థులకు సూచించారు. శనివారం పోలీస్‌స్టేషన్ చూసొద్దాం రండి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బొండపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రికార్డులు భద్రపరిచే గది, లాకప్ గది, రిసెప్షన్ తదితర వాటి పై అవగాహన కల్పించారు. ప్రజలకు హాని కల్గించే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులను కోరారు. ప్రమాదాలు వంటివి సంభవించినపుడు భయం లేకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను ఎస్ఐ నివృత్తి చేశారు.

హుదూద్ ఇళ్లకు సౌకర్యాల కల్పన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని లంకాపట్నం ప్రాంతంలో ఉన్న హుదూద్ ఇళ్ల సముదాయానికి అన్ని వసతులూ కల్పించే విధంగా త్వరలో చర్యలు చేపడతామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. శనివారం హుదూద్ ఇళ్ల సముదాయ ప్రాంతంలో పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యుత్ సౌకర్యం, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం వంటి కనీస మౌలిక సదుపాయాలు లేవని స్థానికంగా నివాసముంటున్న వారు కమిషనర్ వద్ద ఏకరువు పెట్టారు. దీనికి స్పందించిన ఆయన తక్షణమే అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలు చెత్తాచెదారాలు, మొక్కలతో అధ్వానంగా ఉందని దీనిని వెంటనే పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, పరిశుభ్రపరచాలని ఉద్యాన శాఖ అధికారి ఉమా భరణికి చెప్పారు. వారానికి రెండుసార్లు వాటర్ ట్యాంకు ద్వారా నీళ్లు వస్తున్నాయని స్థానికులు చెప్పగా ఇకనుండి రోజు విడిచి రోజు వాటర్ ట్యాంకులు పంపిస్తామని భరోసా ఇచ్చారు. విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు వీధి దీపాలు, కొళాయి కనెక్షన్లు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అనధికారికంగా హుదూద్ ఇళ్లల్లో నివాసముంటున్న వారిని తరలిస్తామని తెలిపారు. పర్యటనలో డిఇ శ్రీనివాసరావు, ఎఇ సూరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ భరోసా అమలు పరిశీలన

ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా పింఛన్ల పంపిణీని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య వివిధ ప్రాంతాలలో పరిశీలించారు. ఉదయం 7 గంటల నుండి ప్రారంభమైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కార్యదర్శులు పనితీరును ఫోటో క్యాప్చరింగ్ వంటి ప్రక్రియలను గమనించారు. పింఛన్లు అందుతున్న తీరును లబ్ధిదారుల నుండి అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఇంటి వద్దనే వారి నుంచి బయోమెట్రిక్ తీసుకొని పింఛను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఏ కారణం వల్లనైనా ఎవరైనా పింఛను తీసుకోకపోతే మరుసటి రోజు అందిస్తామని తెలిపారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

సిఎంపై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఫైర్

ప్రజాశక్తి-వంగర

సిఎం చంద్రబాబు మోసాలకు ప్రతిరూపంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ధ్వజమెత్తారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అని ఎద్దేవాచేశారు. మండలంలోని కోనంగిపాడులో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ చెప్పిన మాటలకు బడ్జెట్ కేటాయింపులకు పొంతనే లేదన్నారు. వరుసగా రెండో ఏడాదీ సూపర్ సిక్స్ హామీలకు దిక్కు లేకుండా పోయిందని దుయ్యబట్టారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు అరకొర నిధులు కేటాయించారని, పథకాల అమల్లో కూటమి ప్రభుత్వానికి అసలు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన మాటలకు, ఇప్పుడు కేటాయింపులకు పొంతన లేకుండా బడ్జెట్ రూపొందించారని ఆక్షేపించారు. ఇదంతా సూపర్ సిక్స్ పథకాల అమల్లో ప్రజలను మోసం చేయడంలో భాగమేనని ఆయన ఆరోపించారు. సీనియర్ నాయకుడై ఉండి కూడా బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల కేశవ్ తన మంత్రి పదవి కాపాడుకోవడానికి నారా లోకేష్‌ను, చంద్రబాబును పొగిడే దుస్థితికి దిగజారిపోయారన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ అని పేరు మార్చి ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని విరుచుకుపడ్డారు. 50 ఏళ్లు దాటిన బిసిలకు పింఛను ఇస్తామని మాట తప్పారని, అందుకే చంద్రబాబును నమ్మితే పులి నోట్లో తల పెట్టడమేనని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పిన మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయని గుర్తుచేశారు. సమావేశంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శనరావు, పారినాయుడు, వేమిరెడ్డి సూర్యనారాయణ, కోనంగిపాడు సర్పంచ్ చందక తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి

బొబ్బిలిరూరల్.. ర్యాలీ నిర్వహిస్తున్న సిడిపిఒ విజయలక్ష్మి, అంగన్వాడీలు, విద్యార్థులు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని పక్కి, పారాది, చింతాడ, కలవరాయి, పిరిడి, అలజంగి గ్రామాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వారోత్సవాలను సైకిల్ ర్యాలీతో ప్రారంభించారు. అలజంగిలో ఆమె మాట్లాడుతూ మహిళా వికాసంతోనే దేశం ప్రగతి పథాన నడుస్తుందన్నారు. ముఖ్యంగా బాలికా దశ నుంచే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతీ బాలికను చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సెక్టార్ల సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రేగిడి : మండలంలోని సంకిలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడి సూపర్వైజర్ జి.జానకమ్మ, జి.సుజాత, సిహెచ్ .నూకాలమ్మ, అమన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు గిరిజన సంఘ నాయకుల వినతి

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతి అందిస్తున్న గిరిజన సంఘ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం

శ్రీకాకుళం జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని కోరుతూ శ్రీకాకుళం గిరిజన ఐక్యవేదిక అధ్యక్షులు చౌదరి లక్ష్మీ నారాయణ ,జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు గేదెల రమణ మూర్తి .. రాష్ట్ర ఎస్టీ కమిషన్. చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. విజయనగరం లోని క్యాంపు కార్యాలయంలో శనివారం వారు చైర్మన్ ను కలిసారు. జిల్లాల మార్పుల తరువాత శ్రీకాకుళం జిల్లాలో ఐటిడిఎ లేని పరిస్థితి ఏర్పడిందనీ, అందువల్ల గిరిజనుల అభివృద్ధికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. సారవకోట, మెలియాపుట్టి, టెక్కలి ప్రాంతాల గిరిజనుల సమస్యలనుఈ సందర్భంగా చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు స్పందిస్తూ ఐటిడిఎ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు.

రాయితీపై స్వయం ఉపాధి యూనిట్లు

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు అనేక రకాల స్వయంఉపాధి యూనిట్లు రాయితీతో రుణాలను మంజూరు చేస్తుందని, వాటిని సద్వినియోగం కూడా మహిళలు అదే స్థాయిలోనే చేసుకుంటున్నారని ప్రకాశం జిల్లాకు చెందిన డిఆర్‌డిఎ ట్రైనీ పథక సంచాలకుడు డి.నారాయణ అన్నారు. సెర్ఫ్ శాఖ సిఇఒ ఆదేశాల మేరకు కంప్యూటరీ ఎంబ్రాయిండింగ్ శిక్షణను శనివారం ఆయన పరిశీలించారు. మహిళలు, ఉద్యోగులతో మాట్లాడారు. విజయనగరం, గంట్యాడ, బొండపల్లి, నెల్లిమర్ల, సంతకవిటి, వంగర, గజపతినగరం తదితర మండలాల్లో మహిళలు నిర్వహిస్తున్న బ్యూటిషియన్, కంప్యూటర్ అంబ్రాయిడింగ్, హారతి కర్పూరం తయారి, పేపరు ప్లేట్స్, మాప్ స్టిక్స్ తదితర యూనిట్లు పరిశీలించారు. తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలు స్వయం ఉపాధికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఆయన వెంట వెలుగు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుణ్యగిరి హుండీ ఆదాయం రూ 6,14,418

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మహాశివరాత్రి సందర్భంగా పుణ్యగిరి ఉమాకోటి లింగేశ్వర స్వామి ఆలయం, ధార గంగమ్మ ఆలయాల హుండీల ఆదాయం రూ. 6,14,418 లభించింది. హుండీల ఆదాయాన్ని శనివారం దేవాదాయ కార్య నిర్వాహణాధికారి కె.నాగేంద్ర ఆధ్వర్యంలో లెక్కించారు. పుణ్యగిరి శివాలయం వద్ద హుండీ ఆదాయం రూ. 5,72,327, ధార గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.42,091 లభించింది. కొట్టం కోటమ్మ ఆలయ ఇఒ జి.శ్రీనివాస్, పుణ్యగిరి ఇఒ నాగేంద్ర పర్యవేక్షించారు.

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

తెరచుకోని భోగాపురం సచివాలయం

ఎనిమిది మంది సిబ్బంది ఉన్నా తాళాలే

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని అత్యంత రద్దీ కలిగిన భోగాపురం -1 సచివాలయం శనివారం మూతబడింది. సిబ్బంది ఎవరు కూడా ఉదయం నుంచి తాళాలు తీయకపోవడం విశేషం. దీంతో వివిధ పనులపై సచివాలయానికి వెళ్లిన ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమాచారం ఎంపిడిఒ కె.గాయత్రి దృష్టికి వెళ్లడంతో మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో సిబ్బంది వచ్చి సచివాలయ తాళాలు తీయడం గమనార్హం. అదే ఎంపిడిఒ దృష్టికి ఈ వ్యవహారం వెళ్లకపోతే సాయంత్రం వరకైనా తాళాలు తెరిచే పరిస్థితి ఉండదని పలువురు అంటున్నారు. మండల కేంద్రంలో ప్రజలు ఎక్కువగా ఈ సచివాలయంపై ఆధారపడుతుంటారు. ఈ సచివాలయంలో ప్రస్తుతం ఎనిమిది మంది సిబ్బంది పనిచేస్తున్నారు. కానీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సచివాలయం ఎప్పటికప్పుడు మూసివేస్తున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ సచివాలయం సిబ్బంది పనితీరుపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

తాళం వేసి ఉన్న సచివాలయం

ఎస్‌డబ్ల్యుపిసి నిర్వహణపై అసంతృప్తి

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని మండవకురిటి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం(ఎస్‌డబ్ల్యుపిసి)ని డిపిఒ టి.వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన కేంద్రం నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాన్ని నిర్లక్ష్యంగా గాలికి వదిలేయడంతో పంచాయతీ కార్యదర్శి అల్లాడ దుర్గారావుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వాహనాలకు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తేవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, ఇఒపిఆర్‌డి రఘునాథాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపిసిని పరిశీలిస్తున్న డిపిఒ వెంకటేశ్వరరావు

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి-తెర్లాం

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా శనివారం నెమలాం, ఉద్దవోలు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

మెరకముడిదాం : పశువులకు సోకే గాలికుంటు, బ్లూ సెల్లుస్ వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరని మండల పశువైద్యాధికారి సిహెచ్ హైమావతి తెలిపారు. శనివారం మండలంలోని గర్భాంలో 594 పశువులకు గాలికుంటు వ్యాధులు, 20 ఆడ దూడలకు బ్లూ సెల్లుస్ వ్యాధికి సంబంధించి టీకాలు వేశారు.

తెర్లాం.. పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్



వైద్యాధికారి ధరణిని సత్కరిస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

వైద్యాధికారి ధరణికి సత్కారం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణికి గుంటూరు జిజిహెచ్‌లో పిజి సీటు వచ్చింది. ఈ నేపథ్యంలో వైద్యాధికారి విధుల నుంచి రిలీవ్ అవుతున్న ఆమెను పిహెచ్‌సి సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధరణి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కష్టపడి పని చేస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సేవలను సిబ్బంది కొనియాడారు. స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ పొందిన ఎంఎల్‌హెచ్‌పి జి.కోమలిని సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కె.అజయ్‌కుమార్, ఆయుర్వేద వైద్యాధికారి పి.జి.సింధు, సిహెచ్‌ఒలు జిఆర్ఎస్ ఆంజనేయులు, బండారు పార్థసారథి, యుడిసి కె.శ్రీనివాసరావు, హెల్త్ సూపర్వైజర్ వివి రమణ, తదితరులు పాల్గొన్నారు.

10న చలో అచ్యుతాపురం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రైవేట్ ఫిట్నెస్ కేంద్రం ఎత్తివేయాలని ఈనెల 10న తలపెట్టిన చలో అచ్యుతాపురం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఎఐఎఫ్‌టియు అనుబంధ ఆటో యూనియన్ మోటార్ కార్మికులు శనివారం ర్యాలీ చేపట్టారు. గాంధీ పార్కునుంచి గంటస్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి నాయకులు రెడ్డి నారాయణరావు, అప్పలరాజు రెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిఒ ఆఫీసుల వద్ద మధ్యవర్తులు లేకుండా నిరోధించడం కోసమే ప్రైవేటు ఫిట్నెస్ సెంటర్ ఏర్పాటు చేసామని చెబుతోందని, ఆన్‌లైన్ పేరుతో ఆర్‌టిఒ ఆఫీస్ చుట్టూ ఉన్న మధ్యవర్తుల ద్వారానే, ప్రైవేట్ ఫిట్నెస్ కేంద్రం ప్రారంభించినప్పటి నుండి ఈరోజు వరకు రూ.860 చలానాతో పాటు అదనంగా రూ. 3300 పైనే వసూలు చేస్తున్నారని విమర్శించారు. రూ. 860 చలానా కట్టి నేరుగా ఫిట్నెస్ కేంద్రం వద్దకు వెళితే కంప్యూటర్ పేరుతో ఫెయిల్ చేసేస్తున్నారని తెలిపారు. కావున తక్షణమే అచ్యుతాపురంలో ఉన్న ప్రైటు ఫిట్నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. పాఠశాల ఆవరణ, తాగునీటి పథకం, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం విద్యార్థులకు ఇస్తున్న రాగిజావను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు కె.రాంప్రసాద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాల బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పాఠశాల బస్సు ఢీకొని సరితి నాగభూషణం (58) అనే వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన శనివారం శృంగవరపుకోట పట్టణంలో విశాఖ-అరకు రహదారిలో చోటుచేసుకుంది. ఎస్ఐ గంగరాజు కథనం ప్రకారం.. శృంగవరపుకోట పంచాయతీ సీతమ్మపేటకు చెందిన నాగభూషణం.. రైతు బజారు నుంచి నడుచుకుని వెళ్తున్నాడు. సర్వేపల్లి స్కూల్ బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ బస్సు నడుపుతూ ఆయన్ను ఢీకొన్నాడు. స్థానికులు ఆయన్ను ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడు. నాగభూషణం భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

పక్కా ప్రణాళికతో టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి-రామభద్రపురం

పక్కా ప్రణాళికతో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎగ్జామ్ చీఫ్ రామారావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, బెంచీలు, వెలుతురు, స్ట్రాంగ్ రూం వంటి వాటిపై ఇన్‌ఛార్జి హెచ్‌ఎం నాగభూషణరావుతో శనివారం చర్చించారు. తరగతి గదుల వసతి పరిస్థితులను పరిశీలించారు. ఇక్కడ 12 గదుల్లో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా బెంచీలు లేకపోవడంతో ఇతర పాఠశాలల నుంచి బెంచీలు తెస్తామని ఉపాధ్యాయులు చెప్పారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఎంఇఒ పెంటయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.